నగరంలో వరుణ్ సందడి

మట్కా సినిమా ప్రమోషన్ కోసం ప్రముఖ సినీ హీరో వరుణ్ తేజ్ ఆదివారం విజయనగరంలోని ఆదిత్య థియేటర్‌కు విచ్చేశారు. ఆయనను చూసేందుకు అధిక సంఖ్యలో జనం రావడంతో తోపులాటలో సినిమా థియేటర్ అద్దాలు పగిలి ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి.

- ప్రజాశక్తి,విజయనగరం కోట

మీడియాతో మాట్లాడుతున్న వరుణ్‌తేజ్

విద్యుత్తు బిల్లుల షాక్



- జిల్లా ప్రజలపై రూ.267 కోట్లు భారం
- సర్దుబాటు ఛార్జీల పేరిట ఈనెల నుంచి అదనపు వసూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వినియోగదారులకు విద్యుత్ షాక్ తగలింది. సర్దుబాటు ఛార్జీల పేరిట ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వం ఈ నెల నుంచే పెంచింది. 15నెలలు పాటు ఈ బాదుడు కొనసాగనుంది. అధికారంలోకి రాకముందు విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోపోగా ప్రజలపై భారాలు వేసి బాదుడు ప్రారంభించింది. దీంతో ఈనెల విద్యుత్తు బిల్లులు గతం కంటే అధికంగా రావడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. నష్టాల పేరిట 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు సర్దుబాటు ఛార్జీలను 15 నెలల పాటు వసూలు చేసేందు డిస్కంలకు ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ఇటీవల అనుమతులిచ్చింది. దీంతో 2026 జనవరి వరకూ విద్యుత్ ఛార్జీలతోపాటు అదనపు బాదుడు తప్పదు.

జిల్లాలో విద్యుత్ గృహ వినియోగ కనెక్షన్లు 5,72,464, వాణిజ్య కనెక్షన్లు 61282, పరిశ్రమలు 2753, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థలకు సంబంధించిన కనెక్షన్లు 11423 ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పలుమార్లు పెంచింది. దీనికితోడు ట్రూఆప్ ఛార్జీల పేరిట వినియోగదారులపై భారం మోపింది. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.100 నుంచి రూ.150 వరకూ సామాన్య కుటుంబానికి విద్యుత్ ఛార్జీలు ఉండేవి. కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అవి రెట్టింపయ్యాయి. 100 నుంచి 150 శాతానికి పెరిగాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన టిడిపిప్రభుత్వం మళ్లీ అదనపు ఛార్జీల పేరిట భారం వేసింది. విజయనగరం పావని నగర్ లో నివాసం ఉంటున్న ఎస్.ఆదిలక్ష్మి ఇంటికి నవంబర్ 1 తేదీ నాటికి విద్యుత్ బిల్లు రూ.275 రాగా, దానికి అదనంగా రూ.226 ట్రూ ఆఫ్ ఛార్జీలు జత చేసి రూ.502 విద్యుత్తు బిల్లు వచ్చింది. రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో పాన్ షాప్ నడుపుతున్న బి.సతీష్ అనే యజమానికి 2036 ఒరిజనల్ బిల్లు రాగా దానికి 654 రూపాయిలు అదనంగా ట్రూ ఆఫ్ ఛార్జీలు తోడై రూ.2700 బిల్లు రావడంతో ఆయన లబోదిబోమంటున్నాడు.

ఇలా గృహ, వాణిజ్య, పరిశ్రమలకు విద్యుత్ బిల్లులతో సమానంగా ట్రూ అప్‌ఛార్జీలు విధించడంతో జిల్లా ప్రజలపై రూ. 267 కోట్లు భారం పడనుంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సర్‌ఛార్జీల రూపంలో యూనిట్ ధర రూ.1.50 పైసలు పెంచింది. 30 యూనిట్లలోపు వినియోగిస్తే యూనిట్‌కు రూ.1.90 వసూలు చేస్తున్నారు. తాజాగా ఈ సర్దుబాటు ఛార్జీలతో అది రూ.3.20కు పెరగనుంది. అలాగే 400యూనిట్ల వరకూ ఖర్చుచేసే వినియోగదారుడికి ఇప్పటివరకూ యూనిట్‌కు రూ.9.75 వసూలు చేస్తుండగా.. ఇక నుంచి రూ.12.30 పైసల వరకూ పెరగనుంది. ఈ లెక్కన జిల్లాలో గృహ వినియోగదారులపై రూ.38 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై రూ.9 కోట్లు, పరిశ్రమలపై రూ.201 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాలు,పలు సంస్థలపై రూ.19 కోట్లు భారం పడింది. సెప్టెంబరు నెలకు సంబంధించి విద్యుత్‌చార్జీల రూపంలో అన్ని రకాల వినియోగదారుల నుంచి రూ.97.16కోట్లు అదనంగా వసూలు చేశారు. కానీ ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల రూపంలో మోత మోగడంతో రూ.267 కోట్లుకు పెరిగింది.

ఒక గృహ వినియోగానికి గత నెలలో రూ.225, ఈనెల ట్రూఅప్ ఛార్జీలతో రూ.502గా వచ్చిన బిల్లులు

విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయం

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఛార్జీలు పెంచడం అన్యాయం. మాకు ఎప్పుడూ రూ.2వేలు దాటి బిల్లు రాలేదు.కానీ ఈనెల రూ.2700 వచ్చింది. మాలాంటి చిరు వ్యాపారులకు ఇది పెనుభారం. వెంటనే ప్రభుత్వం విద్యుత్ భారాలు వెనక్కి తీసుకోవాలి.

బి.సతీష్, చిరు వ్యాపారి, విజయనగరం

విద్యుత్తు బిల్లులు తగ్గించాలి

మాకు మెడికల్ షాపు ఉంది. ప్రతి నెలా రూ. 700 నుంచి రూ.900 లోపు కరెంట్ బిల్లు వస్తోంది. అదే పద్ధతిలో ఈనెల 783 బిల్లు వస్తే, దానికి అదనంగా మరో రూ.520 ట్రూఅప్ ఛార్జీలు వేసి రూ.1300 బిల్లు వచ్చింది. ఇంత దారుణంగా కరెంట్ బిల్లులు పెంచితే ఎలా కట్టుకోగలం.

సిహెచ్ గణేష్, కొండవెలగాడ

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగుల ధర్నా
- ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఉద్యమం : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్న 104 ఉద్యోగులకు జీవో 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన జరిగిన ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియుజిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎ.రామారావు, డి.జగన్మోహన్ మాట్లాడారు. 16ఏళ్లగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నారని, కోవిడ్‌లోను, తీవ్ర తుపాన్లలోను, విజయవాడ ముంపునకు గురైన సందర్భంలోను ప్రజలకు విశేష సేవలందించారని తెలిపారు. జీవో 3, జీవో 151 ప్రకారం ఔట్ సోర్సింగ్ విధానం లో పనిచేస్తున్న వారిని గత ప్రభుత్వం 2020 జులై 1 నుండి అరబిందో ఫార్మా ఫౌండేషన్ అనే సర్వీస్ ప్రొవైడర్ కి ఇచ్చిందని, తరువాత ప్రైవేట్ కి అప్పగించి త్వరలో త్వర ఆప్కాస్ విలీనం చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా తీవ్రమైన అన్యాయం చేసిందని తెలిపారు. 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకుని,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కన్నా తక్కువ జీతాలు తీసుకుంటూ సేవలందిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలను దృష్టిలోపెట్టుకొని జీవో 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే త్వరలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 4459 ప్రకారం 7 వాహనాలకు ఫిట్ నెస్ ఇన్సూరెన్స్ లు వెంటనే చేయించాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు అర్.సన్యాసి నాయుడు, కె.సత్యన్నారాయణ, బి.కృపారావు, హరి, 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

జిఒ 117ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, పిడిఎఫ్ ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి డిమాండ్ చేశారు. స్థానిక శ్రీనిధి పాఠశాలలో ఆదివారం రామభద్రపురం మండలం యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించి అమర వీరులకు నివాళు లర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో ఈశ్వరరావు మాట్లాడుతూ వైసిపి హయాంలో జీవో 117 ద్వారా విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. అందులో భాగంగానే 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో 1,2 తరగతులలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే అమలు చేయడంతో తెలుగు మీడియం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యా రంగం పూర్తిగా నిర్వీర్యం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి విద్యా రంగాన్ని కాపాడేందుకు జీవో 117ను రద్దు చేయాలని కోరారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించకుండా యాప్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి నిరంతరం పని చేస్తున్న తనను ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆనందోబ్రహ్మ టీమ్ చిన్నారులు, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రామభద్రపురం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీరాములునాయుడు, అధ్యక్షులుగా జి.సుధాకరరావు, సహాధ్యక్షులుగా రాంబాబు, జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా బి.శంకర రావు, కోశాధికారిగా వి.వెంకట రావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్. త్రినాథరావు ఎన్నికయ్యారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, శశిభూషన్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుదీర్ఘకాలం నిలిచేలా కోర్టు భవనాల నిర్మాణం

- న్యాయవాదులు కమిటీగా ఏర్పడి భవనాల నిర్మాణంపై బాధ్యత తీసుకోవాలి
- బార్ అసోసియేషన్ ఐక్యత, పట్టుదల వల్లే నూతన కోర్టు భవనాలు మంజూరు
- యువ న్యాయవాదులే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి
- కృతజ్ఞత సత్కార సభలో హైకోర్టు న్యాయమూర్తులు
- పదిమంది హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించిన బార్ అసోసియేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ లేనివిధంగా విజయనగరం జిల్లా కోర్టుకు ఆధునిక వసతులతో కూడిన నూతన భవన సముదాయం మంజూరైందని, సుదీర్ఘకాలం పాటు నిలిచేలా భవన నిర్మాణం సమయంలోనే న్యాయవాదులు బాధ్యత తీసుకోవాలని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు సూచించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులే ఈ భవనాల్లో న్యాయవాద వృత్తిలో ప్రాక్టీస్ చేయనున్నందున వారిపైనే భవనాల నిర్మాణం, నిర్వహణ బాధ్యత అధికంగా ఉంటుందన్నారు. విజయనగరం బార్ అసోసియేషన్ చూపిన ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే నూతన భవనాల మంజూరు సాకారమయ్యిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయమూర్తులను అందించడంలో విజయనగరం ముందంజలో వుందన్నారు. విజయనగరం జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణం రూ.100 కోట్లతో మంజూరు చేసిన నేపథ్యంలో ఈ జిల్లాకు గతంలో అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా పనిచేసిన పలువురు న్యాయమూర్తులకు, జిల్లా వాసులైన హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞత పూర్వక అభినందన సభ ఆదివారం నగరంలోని లీపేరడైజ్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.హరీష్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ దోనాడి రమేష్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ కె.మన్మధరావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తదితరులను శాలువ, మొమెంటోతో విజయనగరం, విశాఖ, పార్వతీపురం జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

సభలో ప్రసంగిస్తున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్

ఈ సందర్భంగా జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు మాట్లాడుతూ కోర్టు భవనాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. మిగతా న్యాయమూర్తులు మాట్లాడుతూ వదిలివేయబడిన చెరువులో తేలికపాటి మట్టితో కూడిన నేలపై నిర్మించిన కారణంగానే గతంలో 30ఏళ్ల క్రితం నిర్మించిన కోర్టు భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. జిల్లా బార్ అసోసియేషన్ ధృఢ సంకల్పంవల్లే ఈ ప్రాజెక్టు ఇంత త్వరగా కార్యరూపం దాల్చిందన్నారు. బార్ సభ్యుల కృషికి తన తోటి హైకోర్టు న్యాయమూర్తుల సహకారం లభించడంతోపాటు, జిల్లా వాసిగా సొంత జిల్లాకు న్యాయవ్యవస్థ పరిధిలో ఏదైనా చేయాలనే తన తపన తోడై భవనాల మంజూరు త్వరగా సాకారమైందన్నారు. ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా న్యాయవ్యవస్థకు మౌళిక వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. ఈనేపథ్యంలోనే దెబ్బతిన్న పాత కోర్టు భవనాల స్థానంలో ఆధునిక వసతులతో కొత్తవి మంజూరు చేసేందుకు ప్రాధాన్య మిస్తున్నారని పేర్కొన్నారు. భవనాల నిర్మాణం నిర్ణీత సమయానికి పూర్తి కావాలంటే నిర్మాణ సంస్థతో పాటు బార్ అసోసియేషన్ కూడా బాధ్యత తీసుకోవలసి వుందన్నారు. కొన్ని వందల కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న ఈ భవనాన్ని పరిరక్షించుకొనే బాధ్యత న్యాయవాదులపైనే వుంటుందని చెప్పారు. న్యాయమూర్తులను గౌరవించడంలో, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటంలో ఈ జిల్లా ఎప్పుడూ ముందంజలోనే నిలుస్తోందని అన్నారు. బార్ అసోసియేషన్ లో వున్న ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే కొత్త భవనాల మంజూరు సాధ్యమైందని అన్నారు. జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.హరీష్, న్యాయవాది కె.వి.ఎన్. తమ్మన్నశెట్టి తదితరులు కూడా మాట్లాడారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్పి వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లా కోర్టు నూతన భవనాల నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా విశిష్టతలు, ఇక్కడి ప్రముఖులతో కూడిన స్వల్ప నిడివి గల చిత్రాన్ని ప్రదర్శించారు. జిల్లా కోర్టు భవన నిర్మాణ విశేషాలతో కూడిన మరో చిత్రాన్ని కూడా ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు హాజరయ్యారు.

జిల్లా పోర్టుపోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్ రావును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సభలో పాల్గొన్న ఎపి, గుజరాత్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు

ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మెగా ప్రాజెక్టు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకి ఒక మెగా ప్రాజెక్టని కేంద్ర పౌరవిమానాయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతరం చేసేందుకు నెలనెలా పనులను పరిశీలిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం విమానశ్రయ టెర్మినల్, రన్‌వే తదితర పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విమానాశ్రయాలు ఉన్నచోట జాబ్ గ్రోత్ పెరిగిందని అన్నారు. టూరిజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అంతేకాక చిన్నచిన్న కంపెనీలు వస్తే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తయితే ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఎంతో అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఇది ఉత్తరాంధ్రకే మెగా ప్రాజెక్టని తెలిపారు. అందుకు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఖచ్చితంగా 2026 జూన్ నాటికి పనులు పూర్తి చేయాలని దృఢనిశ్చయంతో ఉన్నామని అన్నారు. జీఎమ్మార్ సంస్థ ప్రతినిధి రామరాజు పనులు గురించి మంత్రికి వివరించారు.



పనులనుపరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆలోచింపజేస్తున్న నాటికలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

అభినయ నాటకశాల సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ 8వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో హృద్యంగా సాగుతున్నాయి. ఆదివారం ప్రదర్శించిన పలు నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. గుంటూరు జిలా కాట్రపాడు ఉషోదయ కళానికేతన్‌కు చెందిన చెరుకూరి సాంబశివరావు రచన దర్శకత్వంలో ప్రదర్శించిన 'విముక్తి' నాటిక యువత జీవితం నాశనం చేసుకోవద్దని విముక్తి నాటిక తెలిపింది. ప్రదర్శితమైంది. యువత ప్రస్తుత రోజుల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఏ విధంగా బానిసలు అవుతున్నారో కళ్లకు కట్టినట్లు చూపారు.

2వ నాటికగా సింహ ప్రసాద్ రచన, డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే మూల్యం నాటిక ప్రదర్శించారు. మూల్యం నాటికలో స్త్రీ పుట్టినాటి నుంచి అనేకాంక్షలతో సామాజికట్టుబాటులతో ఏ విధంగా ఉంటుందో వివరిస్తూ, నేటి రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ముందుకు పయనిస్తూ తమ హక్కులను సాధిస్తూ ఉన్నత స్థాయికి ఏ విధంగా వెళు న్నారో తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు అభినయ శ్రీనివాస్, కార్యదర్శి గెద్ద వరప్రసాద్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కృష్ణా మోటార్స్ డైరెక్టర్ ఎం. సుధాకర్, సమన్విత ఏజెన్సీ నిర్వాహకులు జి.నాగిరెడ్డి, దవళ సర్వేశ్వరరావు, గ్రంధి విష్ణు, పాల్గొన్నారు.

నాటికలో ఓ సన్నివేశం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ .శ్రీనివాసమూర్తి ఆదివారం పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈనెల 9, 10 తేదీల్లో చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. స్థానిక కణపాక పాఠశాలలో 25, 26, 27 పోలింగ్ కేంద్రాలను డిఆర్‌ఓ సందర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల గురించి బిఎల్‌ఒలను ఆరా తీశారు. సవరణ ప్రక్రియ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈ సందర్భంగా బిఎల్‌ఒలను డిఆర్‌ఒ ఆదేశించారు. ఈ నెల 23,24 తేదీల్లో కూడా స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల డిప్యూటీ తాహశీల్దార్ సంజీవి కూడా పాల్గొన్నారు.



ఓట్ల నమోదును పరిశీలిస్తున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

ముమ్మరంగా ఓటర్లు నమోదు కార్యక్రమం

విజయనగరం టౌన్ : నగరంలో ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ జాబితా పై అభ్యంతరాల స్వీకరణ, కొత్త ఓటర్ల నమోదు, ఫారం 6ను వినియోగించి 18 సంవత్సరాల నుండి వారందరూ ఓటరుగా నమోదు చేసుకునే ప్రక్రియ జరుగుతుంది. ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ప్రతి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి నల్లనయ్య మాట్లాడుతూ కొత్త ఓటర్ల సంఖ్య పెరిగే దిశగా ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ 23, 24 తేదీల్లో కూడా కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

ఎన్నికల పరిశీలకులు ఎం.ఎం నాయక్ రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో వున్న కారణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నవంబరు 11వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లా ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐఎఎస్ అధికారి ఎం.ఎం.నాయక్ సోమవారం జిల్లాకు రానున్నట్టు కలెక్టర్ తెలిపారు.

నూతనంగా ఎన్నికైన విద్యాశాఖ ఉద్యోగుల సంఘం సభ్యులు

ఎపి స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జివిఎన్ఎస్ రామకృష్ణ, ఎం.సూర్యనారాయణ మూర్తి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్లో జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మకుమారి, శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ను రానున్న కాలంలో మరింత బలోపేతం చేసేందుకు నూతన జిల్లా కమిటీ కృషి చేయాలన్నారు. తర్వాత రాష్ట్ర మంత్రిని, రాష్ట్ర అధికారులను కలిసి విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో బి.రాము నాయుడు, ఉపాధ్యక్షులుగా బి.కమల కుమారి, బి.కార్తీనాయుడు, జి.సంధ్యా రాణి, వై.చిన్నారావు, ఎం.రామారావు, సహాయ కార్యదర్శులుగా ఎ.సత్యం నాయుడు, కె.శ్రీనివాసరావు, జి. సూరజ్, గురునాయుడు, పి.త్రివేణి, పి.రోజా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.ఉపేంద్ర, కోశాధికారిగా ఎం.నీరజ ఎన్నికయ్యారు. సమావేశానికి పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు అనందరెడ్డి, ఎన్నికల అధికారిగా రంగాచారీ వ్యవహరించారు. విద్యాశాఖ ఉద్యోగులు ఎన్నికయ్యారు.

'టేకు చెట్లు మాయం' పై స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్లు 1,4,5,7,8,9,11,15,62లో7,8, 67లో1,2,3,5,6,7,9 లో ఏ విధమైన అనుమతులూ లేకుండా కొంత మంది టేకు చెట్లు నరికివేసి తరలించేస్తున్నారని ప్రజాశక్తి దినపత్రికలో 'టేకు చెట్లు మాయం' కథనం వెలువడింది. దీనికి స్పందించిన తహశీల్దార్ జె. రాములమ్మ సర్వే చేయించి నివేదిక తెప్పించి కలెక్టర్, ఆర్డిఒ, అటవీశాఖ అధికారులకు పంపించామని ఆమె తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కుళాయిని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట 16వ వార్డులో నీటి సమస్య పరిష్కరించామని కౌన్సిలర్ పాండ్రాంకి సత్యవతి తెలిపారు. ఇందులో భాగంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆదివారం లక్ష్మీ దేవిపేట వద్ద తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. గత 7సంవత్సరాలుగా తాగునీటి కోసం 16వ వార్డులో ఇబ్బందులు పడ్డామని వైసిపి ప్రభుత్వంలో కూడా పలు మార్లు తాగ నీటి సమస్య పరిష్కారం చేయాలని కోరామని ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. నీటి సమస్య పరిష్కారం కోసం జనసేనలో చేరామని, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి చొరవతో నీటి సమస్య పరిష్కారమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు పాండ్రంకి సత్య నారాయణ, ఎంఎం నాయుడు, మద్దిల అప్పన్న, అవనాపు మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఇఆర్ఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రత్యేక ఎన్నికల పోలింగ్ కేంద్రాలను నియోజక వర్గ ఎన్నికల అధికారి ఎం.నూకరాజు ఆదివారం పరిశీలించారు. ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, జాబితాలోని పేర్ల మార్పులు తొలగింపులకు సంబంధించి దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరణతో మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ లెవెల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల బాలుర హైస్కూల్ పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నెంబర్ 21,22లకు సంబంధించి ఏర్పాటైన కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి ఎఫ్ఎస్ఒ నూకరాజు సందర్శించి తనిఖీ చేశారు. కేంద్రంలో విధుల్లో ఉన్న బిఎల్ఒలకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపును పరిశీలిస్తున్న ఎస్ఐ నీలావతి

గుంతలను కప్పించిన ఎస్ఐ

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక ఎస్ఐ పి. నీలావతి రాజాం -పాలకొండ ప్రధాన రహదారిలోని ఉంగరాడ మెట్ట వద్ద గుంతలమయమైన రోడ్డును ఆదివారం జెసిబితో కప్పించారు. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి ఆమె తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి గుంతలను జెసిబితో కప్పించారు. రోడ్డుకిరువైపులా ఉన్న డొంకలను తొలగించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచారామ క్షేత్రాలకు బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

కార్తీక మాసం సందర్భంగా పంచారామాలను భక్తులు దర్శించుకోవడానికి ఆర్టీసీ విజయనగరం డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఆదివారం బయలుదేరిన ఈ బస్సులను డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్లో ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఆదివారం పంచారామాలకు బస్సులు వేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఆదివారం సూపర్ లగ్జరీ, రెండు అల్ట్రా డీలక్స్ బయలు దేరినట్లు తెలిపారు. అమరావతి, భీమవరం , పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు ప్రతీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు బస్సులు బయలుదేరి సోమవారం ఐదు పుణ్య క్షేత్రాలను దర్శింపజేసి, మంగళవారం ఉదయం 6గంటలకు మళ్లీ విజయనగరం చేరుకుంటామన్నారు. వచ్చే వారం వెళ్లాలనుకునేవారు 9959225620 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ, మరియు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

ప్రారంభించిన డిఎస్డిఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జి స్టేడియంలో విజయనగరం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా నుండి సుమారు 150 మంది సబ్ జూనియర్ తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలందరూ ఈనెల 15, 16, 17 తేదీలలో ప్రకాశం జిల్లాలో జరుగు 38వ రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారు. ముఖ్య అతిథిగా డిఎస్డిఒ వెంకటేశ్వరరావు, ఎపిపి చంద్రశేఖర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా నుంచి చాలా మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో స్కూల్ గేమ్స్లో ప్రతిభ చూపారని తెలిపారు. రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ టివి చారి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు తప్పకుండా జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు వెంకటేష్..కె. శ్రీనివాస్, పైడిరాజు పాల్గొన్నారు.

గ్రామాలకు మద్యం కిక్

- పల్లెల్లో విచ్చల విడిగా బెల్టు షాపులు
- నిర్వహణకు లక్షల్లో వేలం
- షాపు యజమానులే కారణం
- సీసాపై అదనంగా రూ. 20 నుంచి రూ.50వసూలు

ప్రజాశక్తి- డెంకాడ, బాడంగి

గ్రామాల్లో బెల్ట్ షాపుల కోసం లక్షల్లో వేలం పాటలు నిర్వహిస్తున్నారు. గ్రామాలాభివృద్ధి పేరుతో లైసెన్స్ షాపు యజమానులే గ్రామాల్లో వేలం పాటలు పంచాయతీ ద్వారా నిర్వహిస్తున్నారు. డెంకాడ మండలంలో ఐదు లైసెన్స్ మద్యం షాపులు పరిధిలో ఇప్పటికే సగం గ్రామాల్లో ఈ వేలం పాటలు నిర్వహించినట్లు తెలిస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహణ కూడా జరుగుతుంది. అనధికారికంగా పంచాయతీలకు డబ్బులు కడుతున్నారు. బెల్ట్ షాప్ కోసం వేలం పాటలో పాడిన వ్యక్తి గ్రామాల్లో ప్రతి మద్యం బాటిల్పై రూ.20 నుంచి 50 రూపాయల వరకు అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. గుణుపూర్ పేటలో బెల్ట్ షాప్ కోసం రూ.13.30 లక్షలకు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వేలం పాటలో పాడుకున్నాడు. పంచాయతీకి లక్ష రూపాయల అనధికారికంగా కట్టినట్లు సమాచారం. గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఆ బెల్ట్ షాప్పై దాడి చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు తీసుకువెళ్లి అక్కడ ఏం జరిగిందో ఏమో వదిలేశారు. మరలా ఆ వ్యక్తి గ్రామంలో బెల్ట్ షాప్ యధావిధిగా నిర్వహిస్తున్నాడు. పెద్ద తాడివాడ పంచాయతీ గుండాలపేటలో రూ.3.70 లక్షలకు బెల్ట్ షాప్ కోసం గ్రామంలో వేలంపాట వేసి అక్కడ బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. ఇక్కడకు ఎక్సైజ్ అధికారులు వచ్చి వారు తీసుకోవాల్సినవి తీసుకొని వెళ్ళిపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అక్కడ బెల్ట్ షాప్ యధావిధిగా నడుస్తుంది. ఇలా ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం బెల్ట్ షాపుల కోసం వేలంపాటలు వేస్తున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ అధికారులు ఒకపక్క చెబుతూ మరోపక్క గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క దాడులు చేస్తామని అంటూ మరోపక్క షాప్ యజమానుల ద్వారా గ్రామాల బెల్ట్ షాపులు నిర్వహించడం చూస్తే ఆశ్చర్యం కలిగిస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెబుతున్నట్లు గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చేయాలని సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

బాడంగి మండలంలోని పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు పుట్టుకొస్తున్నాయి. పైగా ఇష్టానుసారంగా మద్యం ధరలను పెంచి అమ్మేయడంతో మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మూడు షాపులు బొబ్బిలికి చెందిన ఒకే వ్యాపారికి వచ్చాయి. ఈ షాపుల్లో ఒక వ్యక్తి 2 సీసాలు దాటి కొంటే అదనంగా సీసాకి రూ. 10 నుంచి రూ. 20 వసూలు చేస్తున్నారు. అక్కడ నుంచి చాలా మంది అదనంగా డబ్బులు చెల్లించి గ్రామాల్లోకి తీసుకొచ్చి బెల్ట్షాపులు నిర్వహిస్తున్నారు. బెల్ట్ షాపు వద్ద మద్యం కొనుగోలు చేస్తే అదే సీసాకు అదనంగా రూ. 20 నుంచి రూ.30 వరకూ వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వం గత నెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొస్తే మద్యం ఆదాయానికి అలవాటు పడిన కొందరు దానికి సమాంతరంగా బెల్టు షాపుల పాత పాలసీని నడిపిస్తున్నారు. ప్రయివేట్ వ్యక్తులు మద్యం అమ్ముకునేందుకు లైసెన్స్ ఫీజులను నిర్ణయించినట్లుగానే బెల్టు దుకాణాల ఏర్పాటుకు డిమాండ్ను బట్టి ధర నిర్ణయించేశారు. గ్రామాల్లో ఏకంగా వేలం పాటలే నిర్వహించడం బెల్టు దుకాణాలకు పరాకాష్ట. బొబ్బిలి నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో లక్షలు నిర్ణయించినట్లు సమాచారం. అందుకే బాటిల్కు రూ.20 నుంచి 40 వరకూ అదనంగా వేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఎక్సైజ్ శాఖ హెచ్చరికలు ఉత్తివే..

మరోవైపు ఎక్సైజ్శాఖ అధికారులు బెల్టు షాపులు నిర్వహిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పుడు ప్రతి గ్రామంలో ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. సచివాలయ సిబ్బంది ఉంది. ఇంత మంది ఉన్న ఆ గ్రామంలో ఎవరెవరు మద్యం విక్రయిస్తున్నారో తెలియకపోవడం విడ్డూరం. అవసరమైతే వారితో మాట్లాడి ఎక్సైజ్ శాఖ కేసులు నమోదు చేయవచ్చు కానీ అలా చేయడం లేదు. ప్రకటనలు మాత్రం గుప్పిస్తున్నారు. ఒక్కో సందర్భంలో దాడులు చేసి మద్యం బాటిళ్లు పట్టుకున్నా అవి ఏ లైసెన్స్డ్ దుకాణం నుంచి వచ్చాయో గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఎక్సైజ్ అధికారులు ఎందుకో సాహసించడం లేదు. లైసెన్స్డ్ దుకాణాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వాటాలు ఉన్న కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు సహకారంతో సాగిస్తున్న బెల్టు వ్యాపారంపై చర్యలు తీసుకునే సాహసం ప్రభుత్వం చేయగలదా? అంతా వాళ్లే వ్యాపారం చేస్తుంటే సిఎం హెచ్చరికలు ఇంకేం పనిచేస్తాయంటూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానికులతో మాట్లాడుతున్న తమ్మినేని

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. పాకివీధి పక్కనున్న ఖాళీ స్థలాన్ని సిపిఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు పాకివీధి పక్కనున్న ఖాళీ స్థలంలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇస్తామని చెప్పి 1990లో చలనా రూపంలో ఒకొక్క కుటుంబం నుంచి రూ.361 కట్టించుకున్న మున్సిపల్ అధికారులు నేటి వరకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అదే స్థలంలో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇరుకు ఇళ్లలో రెండు, మూడు కుటుంబాలు నివసిస్తూ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసులతో బెదిరించి బలవంతంగా మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తే పోరాటంతో అడ్డుకుంటామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర రావు, వి.లక్ష్మి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'సాధన' అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దుర్గాప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న సంఘాల నాయకులు

మండలంలోని జరజాపుపేట గ్రామానికి చెందిన జాతీయ స్థాయి అవార్డు గ్రహీత, సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గా ప్రసాదును ఆదివారం విజయనగరం యూత్ హాస్టల్లో ఎన్జిఒస్, మాతృభూమి సేవ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిలుగా జిల్లా పౌర వేదిక అధ్యక్షులు బిశెట్టి బాబ్జి, విశిష్ట అతిథిగా కేసలి అప్పారావు పాల్గొని మాట్లాడారు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ఒక తాటిపైకి వచ్చి సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలని ఉద్దేశంతో నివేదికను ఏర్పాటు చేశామన్నారు. యువజన సంఘాలన్నీ ఒకరితో ఒకరు మమేకమై సమిష్టితో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వాటికి పరిష్కారాలు వెతికే దిశగా ప్రయాణం కొనసాగించాలన్నారు. సన్మాన గ్రహీత పోలుబోతు దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఎక్కడైనా ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు సాధన యువజన సంఘాన్ని ఎంతోమంది సంప్రదిస్తూ నేటికీ ఎంతోమంది లైవ్ డొనేషన్ ద్వారా బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో పొంది వారి కుటుంబ సభ్యులను వారి స్నేహితులను కాపాడుకున్నారన్నారు. సాధన యువజన సంఘం ఏర్పాటు చేసినప్పటి నుండి నేటికీ 500 మంది స్వచ్ఛంద రక్తదాతలతో కలిసి ముందుకు వెళుతున్నందుకు తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవ సంఘం అధ్యక్షులు ఇప్పలవలస గోపి, స్ఫూర్తి సేవా సంఘం సాయి, సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, ఆర్ దుర్గాప్రసాద్, ఎం. మోహన్ రావు, పుల్లే మణికంఠ స్వామి, పోలుబోతు నారాయణ రావు, లక్ష్మి, పి.సూరినారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 34 మంది రక్తదానం చేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - భోగాపురం

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భోగాపురంలోని లెండి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెండి కళాశాల ప్రిన్సిపాల్ చొప్పా కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులంతా తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చే విధంగా నడుచుకోవాలన్నారు. చదువుల్లో రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలతో హోరెత్తించారు. కళాశాల అధ్యాపకులు బంగార్రాజు, అప్పలనాయుడు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

విజయనగరం టౌన్ : సెలవు రోజుల్లో సర్వేల పేరిట పని భారం తగ్గించాలని, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి ఎన్జిఒ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం ఎన్జిఒ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఎన్జిఒ హోలులో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జివిఆర్ఎస్ కిషోర్ , ఎ.సురేష్ మాట్లాడారు. పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులతో రోజుకొక సర్వే పేరుతో సెలవు రోజుల్లో కూడా పనులు చేయిస్తున్నారని, పని భారం లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అయినా ఉద్యోగుల పెండింగు బకాయిలు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలన్నారు.

బానాది, బల్లంకిలో ఇకెవైసి సేవలు

ప్రజాశక్తి - వేపాడ

ఇకెవైసిని పరిశీలిస్తున్న గొంప వెంకటరావు

మండలంలోని బానాది, బల్లంకి గ్రామాల్లో ఆదివారం ఇకెవైసి సేవలు అందించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ఉచిత గ్యాస్కు ఇకెవైసి ఉండాలని నిబంధన ఉండటంతో చాలా మంది లబ్ధిదారులు గ్యాస్ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించి బానాది ఎంపిటిసి గొంప తులసీ, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు హెచ్పి గ్యాస్ సిబ్బందిని తమ బానాది, బల్లంకి గ్రామాలకు పిలిపించి దగ్గరుండి లబ్ధిదారులకు ఇకెవైసి చేయించారు. ప్రతి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గ్యాస్ ఏజెన్సీతో మాట్లాడి గ్రామంలోకే వారిని రప్పించి ప్రజలకు ఇకెవైసి చేయించేలా కృషి చేయాలని గొంప వెంకటరావు తెలిపారు. ఆదివారం ఒక్కరోజు బానాదిలో 200 మందికి, బల్లంకిలో 250 మందికి సిబ్బంది ఇకెవైసి పూర్తి చేశారు. ఇంటి వద్దకే సిబ్బంది వచ్చి ఇకెవైసి చేయడం పట్ల ఆ రెండు గ్రామాల ప్రజలు వెంకటరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బానాదిలో ఇకెవైసి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

విద్యుత్ ఛార్జీల పెంపు దారుణం

ప్రజాశక్తి- రామభద్రపురం

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీను

గత వైసిపి ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం కూడా ట్రూ ఆఫ్ పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై పెను బారం మోపడం దారుణమని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను విమర్శించారు. ఆదివారం స్థానిక 3 రోడ్ల కూడలి వద్ద ఆ సంఘం నేతల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం చెప్పిన విధంగా వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో ట్రూ ఆఫ్ ఛార్జీలు పేరుతో విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచిందని స్మార్ట్ మీటర్ల టెండర్లు ఆధానీ గ్రూపు కంపెనీకి ఇచ్చి నగదు భారాలు ప్రజలపై రుద్దాలని చూసిందని అన్నారు. దీనిని వ్యతిరేకించినా ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు మోడీ పంచన చేరి అధికారంలోకి రాగానే అవే ఛార్జీల మోతతో స్మార్ట్ మీటర్లు బిగింపునకు సిద్ధమవుతున్నారని అన్నారు. ఇది ప్రజలను వంచించడమే అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలను నిలువు దోపిడీ చేసే విధంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పనిని తగ్గించి గ్రామాల్లో పేదల పొట్ట కొట్టడానికి సిద్ధమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల డబ్బుతో నిర్మితమైన విశాఖ స్టీల్ ప్లాంట్ అదానికి కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం బరితెగించిందని విమర్శించారు. దేశంలో పేదరికం, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నాయని పాలకులు వీటికి పరిష్కార మార్గం చూపడం లేదని దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నవంబర్ 14న తహశీల్దార్ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టాలని, ఈ ఆందోళనకు ప్రజలందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవాని, విజయ్, వెంకటేష్, తౌడమ్మ, కారంగి లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బ్రౌన్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెసి రాజు

తెలుగుకు వెలుగులు అద్దిన ఆంగ్లేయుడు తెలుగు భాషోద్ధారకుడు, తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన తొలి ఆంగ్లేయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక కళాశాల బాలికల వసతి గృహంలో సిపి బ్రౌన్ 225వ జయంతిని బాలికలు నిర్వహించారు. బ్రౌన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెసి రాజు మాట్లాడుతూ ఆంగ్లేయుడై యుండి తెలుగు భాషమీద మక్కువతో తెలుగును చదవటం, రాయటం నేర్చుకొని ప్రావీణ్యతను పిండి తెలుగు భాషకు తొలి శబ్దకోశ గ్రంథాన్ని, నేటికి ప్రామాణికంగా భావిస్తున్న తెలుగు నిఘంటువును, వ్యాకరణాన్ని రచించి తెలుగు భాషకు వన్నె తెచ్చిన మహనీయుడు సిపి బ్రౌన్ అని అన్నారు. వేమన పద్యాలను సేకరించి, ప్రచురించి, వాటిని ఆంగ్లంలోకి అనువదించి, ఖండాంతర వ్యాప్తి చేసి చిరస్మరణీయునిగా నిలిచి ఆంధ్ర భాషోద్ధారకుడుగా ఖ్యాతి గడించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ బాలికలు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి చెంతకు చేరిన 8 నెలల బాలుడు

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

విజయనగరం పట్టణంలో కిడ్నాప్ అయిన 8 మాసాల పసి బిడ్డ ఆచూకీ కనిపెట్టి, గంటల వ్యవధిలోనే కేసు మిస్టరీని ఛేధించి, బిడ్డను తల్లి చెంతకు వన్టౌన్ పోలీసులు చేర్చారని ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం రాయఘడకు చెందిన అశా సాహు తన భర్త, పసి బిడ్డతో కలిసి కూలి పనుల నిమిత్తం విజయనగరం పట్టణం వచ్చి, ఎత్తు బ్రిడ్జి సమీపంలో ఉంటున్నారు. నవంబరు 8న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో ఆశా సాహు తన బిడ్డను పక్కనే పడుకుండుపెట్టుకుని నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, తన పక్కనున్న అభిన సాహు (8 మాసాలు)ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిపోయారు. విశ్వకాంచన అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో విజయనగరం వన్టౌన్ పోలీసు స్టేషనుకు నవంబరు 9న మధ్యాహ్నం 2 గంటల సమయంలో వచ్చి, ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విజయనగరం వన్ టౌన్ ఎస్ఐ ఎ.నరేష్ కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో సాంకేతికతను వినియోగించి, బాలుడును ఒక మహిళ కిడ్నాప్ చేసినట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. నిందితురాలి ఆచూకీ కనిపెట్టేందుకు విజయనగరం డిఎస్పి ఎం.శ్రీనివాసరావు, వన్ టౌన్ ఇంఛార్జి సిఐ ఎల్. అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆర్టిసి కాంప్లెక్సు, రైల్వే స్టేషను, విజయనగరం పట్టణంలోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాలను, పట్టణ శివార్లలోని ప్రాంతాల్లో ముమ్మర గాలింపులు, తనిఖీలు చేపట్టాయి. చివరకు మూడు గంటల వ్యవధిలోనే బాలుడ్ని కిడ్నాప్ చేసిన నిందితురాలు దాసన్నపేట, నాగాశపు వీధికి చెందిన కోరాడ సుశీల (24)గా గుర్తించి, అరెస్టు చేసి, ఆమె వద్ద నుండి కిడ్నాప్ అయిన అభిన సాహును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తల్లి ఆశా సాహుకు బాలుడ్ని విజయనగరం డిఎస్పి ఎం.శ్రీనివాసరావు అప్పగించడంతో కిడ్నాప్ కేసు సుఖాంతమైందని ఎస్పి తెలిపారు. నిందితురాలు కోరాడ సుశీలను రిమాండుకు తరలించామన్నారు. ఈ కిడ్నాప్ కేసును గంటల వ్యవధిలోనే ఛేదించేటట్లు పర్యవేక్షించిన విజయనగరం డిఎస్పి ఎం.శ్రీనివాసరావు, వన్టౌన్ ఇంఛార్జి సిఐ ఎల్.అప్పల నాయుడు, ఎస్ఐ ఎ.నరేష్, కానిస్టేబుళ్ళు జిన్నం శ్రీను, వెంకట రమణ, ధనలక్ష్మిలను ఎస్పి అభినందించారు.

నేరాలు ఘోరాలు

గొలుసు దొంగతనం కేసులో ఇద్దరు యువకులు అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం కోట

పట్టణంలో ఈ నెల 7న చైన్ స్నాచింగుకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి తులం బంగారం చైను, చైన్ స్నాచింగుకు వినియోగించిన స్కూటీని సీజ్ చేసినట్లుగా విజయనగరం డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. పట్టణంలోని పాల్నగర్కు చెందిన కొవ్వూరి లక్ష్మణ రెడ్డి ఈనెల 7న తన సొంత పనుల మీద విశాఖపట్నం వెళ్ళి, ఆర్టిసి బస్సులో రాత్రి 10.30గంటలకు విజయనగరం వచ్చి ఆర్టిసి కాంప్లెక్స్లో దిగి పివిఆర్ ఆస్పత్రి రోడ్డు మీదుగా రైల్వే స్టేషను వద్ద మోటారు సైకిలు స్టాండులో ఉన్న తన మోటారు సైకిలును తీసుకోవడానికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు స్కూటీ మీద వెనుక నుంచి వచ్చి లక్ష్మణ రెడ్డిని కింద పడేసి, అతని మెడలోని తులం బంగారు చైను తీసుకొని, స్కూటీ మీద పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వన్ టౌన్ ఎస్ఐ సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, స్నాచింగుకు పాల్పడిన వ్యక్తులను విజయనగరం పట్టణానికి చెందిన మహంతి వినోద్ కుమార్, పొట్నూరు డేవిడ్ రాజులను కంటోన్మెంట్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేసి, వారి వద్ద నుంచి తులం బంగారు చైను, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లుగా డిఎస్పి తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని, అతడి గురించి గాలిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన వన్ టౌన్ ఇంఛార్జి సిఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ సురేంద్రనాయుడు, హెడ్ కానిస్టేబుల్ ఎం.అచ్చిరాజు, శ్రీను ఇతర సిబ్బందిని డిఎస్పి అభినందించారు.

'సీతం'లో ఇ-వేస్ట్ సేకరణ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) డ్రైవ్ నిర్వహించారు. సీతం విద్యార్థులు, సిబ్బంది కృషి కారణంగా ఈ డ్రైవ్ ద్వారా 500 కిలోలకుపైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించారు. పాడైపోయిన కంప్యూటర్లు, మానిటర్లు, కీబోర్డులు, పవర్ బ్యాంక్లు, ఎలక్ట్రానిక్ ఓవెన్లు, మిక్సర్లు, గ్రైండర్లు, ఛార్జర్లు, యుపిఎస్ యూనిట్లు, సిసిటివి కెమెరాలు మరియు బ్యాటరీలు వంటి వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఉపకరణాలు ఉన్నాయి. సేకరించిన అన్ని వస్తువులను సుస్థిర వ్యర్థ నిర్వహణలో నిష్ణాతులైన సర్టిఫైడ్ ఈ-వేస్ట్ మేనేజ్మెంట్ కంపెనీ అయిన గ్రీన్ వెవ్స్ ఎన్విరాన్మెంటల్ సొల్యూషన్స్కు అప్పగించారుకీ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ, ఈ-వెస్ట్ భద్రతా రీసైక్లింగ్ కోసం అనుమతులున్న సంస్థలతో సహకారం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, హెచ్ఒడిలు, ఎన్సిసి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఈ వయసులోనే తమ ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలని, ఆ లక్ష్యాలను చేరడానికి నిరంతరం శ్రమించాలని అన్నారు. సమాజంలో మంచి చెడులు పట్ల అవగాహన కలిగి మంచి అలవాట్లను పెంపొందించుకొని చెడుకు దూరంగా ఉంటూ అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ప్రపంచంలో ఉన్న సోషల్ మీడియా ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ వినియోగంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు పట్ల, ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ ప్రేమ పేరుతో మోసాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే పోలీసులకి నేరుగా గాని 112కి కాల్ చేసి తెలియజేయాలని ప్రతి ఒక్క విద్యార్థిని ధైర్యంగా మెలగాలని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.